క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుఅందజేత



ఎల్కతుర్తి : మండలంలోని దండేపల్లి గ్రామానికి చెందిన మాచర్ల అక్షిత్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందాడు. నిరుపేద కుటుంబానికి అతడు ఆర్థిక సాయం కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు రూ.9వేల చెక్కు విడుదల కాగా కాంగ్రెస్ నాయకులు శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలను ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు సంపత్, నాయకులు సుకినె సంతాజీ, గొర్రె మహేందర్, కట్కూరి శ్రీనివాస్, మాచర్ల మల్లయ్య, గంగాధర్, రాజమౌళి, రమేశ్, నాగరాజు, రాజేశ్వర్‌రావు, స్వామి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమలాపూర్ : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో హెడ్ కుక్, అటెండర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఎంఈఓ రాంకిషన్‌రాజు శనివారం ప్రకటనలో తెలిపారు. పదోతరగతి అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 15వ తేదీ సాయంత్రంలోపు తమ దరఖాస్తులను మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందించాలని ఎంఈఓ సూచించారు.

నైపుణ్యంతో బంగారు భవిష్యత్



నర్సంపేట రూరల్ : నైపుణ్యాలు పెంచుకుంటే బంగారు భవిష్యత్తుకు బాటలు పడతాయని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ ఎంబీఏ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని, జూనియర్లకు మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు. బిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. తొలుత విద్యార్థులు నృత్యాలు, ఫన్నీ గేమ్స్, పాటలతో అలరించారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల సెక్రెటరీ డాక్టర్ రాజేశ్వర్‌రావు, బిట్స్ ప్రిన్సిపాల్ హరిహరన్, అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, మేనేజ్‌మెంట్ కళాశాల విభాగాధిపతులు నరేశ్, గోపీకృష్ణ, ఏఓ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



చెన్నారావుపేట : విద్యుదాఘాదంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మరాయినిపహాడ్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల, బాధిత రైతు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మదమంచి సత్యవతికి చెందిన పాడి గేదెలు మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లాయి. ఈ క్రమంలో ఒక గేదె ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తెగిపడిన విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. అనంతరం డాక్టర్ రషీద్, జేఎల్ఎం మహేశ్‌లతో కలిసి పశు వైద్యాధికారి డాక్టర్ మంజీలాల్ గేదెకు పోస్టుమార్టం నిర్వహించారు. గేదె విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయింది. ప్రభుత్వం, విద్యుత్ శాఖ తనకు పరిహారం అందించి ఆదుకోవాలని ఆమె కోరుతోంది.

ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏ లోకి చేర్చాలి

పర్వతగిరి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి చేర్చాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు కొత్తూరు రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఈనెల 15 నుంచి తలపెట్టిన కార్యాచరణ వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరటి వెంకన్న అధ్యక్షతన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడారు. ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు సమస్యలపై తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని చెప్పారు. బీసీ-ఏలోకి మార్చే దిశగా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చే దిశగా చేపట్టిన కార్యాచరణలో ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా
- ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు పూర్తిచేయని కాంట్రాక్టర్లు
- పూర్తయిన చోట నిర్వాహణ లోపం



వేలేరు : మండల కేంద్రంలో సామూహిక మరుగుదొడ్డి లోపల పిచ్చి మొక్కలు

వేలేరు : ఆరుబయట మల విసర్జన నిర్మూలనే లక్ష్యంగా గత ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా లక్షలాది రూపాయలతో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టింది. కానీ అవి ఏ ఒక్క గ్రామంలో పూర్తి కాలేదు. మండలంలోని ఒకటి, రెండు గ్రామాల్లో మినహా దాదాపు అన్ని గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి పనులు చేపట్టగా అవి నిరుపయోగంగా మారాయి. చాలా గ్రామాల్లో భూ సమస్య ఎక్కువగా ఉండటంతో మరుగుదొడ్లను జనసంచారం లేని ప్రాంతాల్లో నిర్మించారు. సామూహిక మరుగుదొడ్లను ఆయా గ్రామాల్లో ఎక్కువ శాతం అప్పటి సర్పంచ్‌లే పనులు చేపట్టారు. బిల్లుల చెల్లింపు అయ్యే వరకు మాత్రమే నిర్మాణ పనులు చేపట్టి తర్వాత బిల్లులు రావడం లేదని పనులను మధ్యలోనే వదిలేశారు. వీటి నిర్మాణం కోసం స్వచ్ఛ భారత్ నిధులు రూ.1.75 లక్షలతో చేపట్టారు. మండల కేంద్రంలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్డిలో పిచ్చిమొక్కలు మొలవడంతో నిరుపయోగంగా మారింది. అదే విధంగా చాలా గ్రామాల్లో నిర్మించిన మరుగుదొడ్లకు తలుపులు, నీటి సౌకర్యం లేకపోవడంతో వాటిని ఎవరూ వినియోగించడం లేదు. అయితే కొన్ని గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి అయిన వాటిని గ్రామపంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన సామూహిక మరుగుదొడ్లను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కన్నారం గ్రామంలో పూర్తికాని మరుగుదొడ్ల నిర్మాణం పనులు

26న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

మడికొండ: పేదల ఇళ్ల కోసం ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలో పార్టీ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు స్థలం ఉన్నవారికి పక్కా ఇళ్లు నిర్మిస్తామని చెప్పి ఇంతవరకు ఆ ఊసే లేదని అన్నారు. ఈనెల 19న తహసీల్దార్ కార్యాలయం ఎదుట, 26న కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాసమల్ల దీన, కొట్టపాక రవి, రాజమణి, సుమన్, ఐలయ్య, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించొద్దు



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ

కాశిబుగ్గ: వరంగల్ రైల్వే స్టేషన్, బస్టాండ్ జంక్షన్‌లో ఆటోలను ఇష్టారీతిన నిలిపి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించొద్దని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సూచించారు. ఈమేరకు వరంగల్ రైల్వే స్టేషన్ జంక్షన్‌లో ఆటో డ్రైవర్లకు శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వరంగల్ బస్టాండ్, రైల్వే స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు నిత్యం వస్తుంటారని, ఈ క్రమంలో ఆటోలను అడ్డదిడ్డంగా నిలపడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేటాయించిన పార్కింగ్ స్థలంలోనే ఆటోలను నిలపాలని సూచించారు. ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేకుంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మహిళలకు అండగా సఖి కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

హన్మకొండ / విద్యారణ్యపురి: మహిళలకు అండగా సఖి కేంద్రం నిలుస్తోందని సఖి కేంద్రం లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి, కేసు వర్కర్ హరిత తెలిపారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి సేవలపై హనుమకొండ వడ్డెపల్లిలోని నారాయణ జూనియర్ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న, సమస్యలో చిక్కుకున్న మహిళలు, బాలికలకు కౌన్సెలింగ్, వైద్య, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం అందిస్తున్నట్లు వివరించారు. చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాల ఎదుర్కొన్న బాధితులకు రక్షణ కల్పించడానికి సఖి సెంటర్ పనిచేస్తోందని చెప్పారు. బాధిత మహిళలు, బాలికలు 181, 0870 2452112 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని వైఆకారం జంక్షన్‌లోని హిందూ జెండా గద్దె స్థానంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 18 అడుగుల 1 అంగుళం ఎత్తుగల అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు శనివారం భూమిపూజ జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి చెన్నూరు దేవేందర్, స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ ఆధ్వర్యంలో వేద పండితుడు భాస్కరాచారి నేతృత్వంలో శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో నలకుంట రవికుమార్, సిద్దం రాము, మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్, అచ్చ వినోద్‌కుమార్, కమ్మ రామ్మోహన్ నాయుడు, కుడికందుల క్రాంతి, గంధ్రాతి నవీన్, అపరాదపు సారంగపాణి, వడ్డెపెల్లి భరత్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



కరీమాబాద్‌లో బీరన్న గుడిని పరిశీలిస్తున్న డీసీపీ



మధ్యకోటలోని పీరీల చావడీని పరిశీలిస్తూ..

ఖిలా వరంగల్: ఈనెల 17న జరగనున్న మొహర్రం, బీరన్న బోనాల పండుగలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ సలీమ సూచించారు. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని బీరన్న గుడి, మధ్యకోటలో పీరీల చావడీలను వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరాం నాయక్, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, కార్పొరేటర్ మరుపల్లి రవితో కలిసి శనివారం సందర్శించారు. మధ్యకోటలో పీరీల ఊరేగింపు, కరీమాబాద్‌లో బీరన్న బోనాలు ఊరేగింపుగా వెళ్లే రోడ్లను పరిశీలించారు. ఊరేగింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏసీపీ, డీసీపీలకు వివరించారు. బందోబస్తుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కోటేశ్వర్, నీల యాకయ్య, రాజేశం, ప్రమీల, కోరె ఐలయ్య, మిర్యాల కుమారస్వామి, గౌడ కోటేశ్వర్, చీర రాజు, మరుపల్లి గౌతమ్, పూజారి బలభద్ర భాస్కర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలి

కాజీపేట: నానాటికి పెరుగుతున్న సాంకేతిక కారణాల వల్ల ఉపాధి కోల్పోతున్న ఫొటో అండ్ వీడియోగ్రాఫర్లను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని సంఘం పట్టణ అధ్యక్షుడు తూర్పాటి జగదీశ్వర్ గుర్తుచేశారు. కాజీపేట 61వ డివిజన్ ఫాతిమానగర్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ డిజిటల్, త్రీడీ రంగ ప్రవేశంతో మ్యానువల్ కార్మికులు రోడ్డునపడే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

- కేసు నమోదు చేసిన పోలీసులు

ధర్మసాగర్ : గుర్తుతెలియని వాహనం ఢీ కొని బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని సోమదేవరపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన మౌటం రమేశ్ –శారద దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు వినయ్(14) ఎల్కతుర్తి మండలంలోని దామెర ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చాడు. బ్యాగు ఇంటివద్ద పెట్టి సైకిల్‌పై దామెర శివారులో గల బాలుడి బాబాయికి చెందిన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి తిరిగి సోమదేవరపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోని వంతెన సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టగా వినయ్ గాలిలో ఎగిరి సైడ్ కాలువలో పడ్డాడు. తలకు, మర్మాంగాలకు బలంగా దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శనివారం బాలుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

పరామర్శ

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటకు చెందిన కారోబార్ రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. తొలుత మృతుని చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ముస్తఫా, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొనకటి రాజు, నాయకులు వీరమనేని సాగర్‌రావు, లింగాల మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టం కోసం పోరాటం

న్యూశాయంపేట: వ్యవసాయ కార్మిక సమగ్ర సంక్షేమ చట్టం కోసం పోరాటం చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశం శనివారం జరిగింది. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో లింగారెడ్డి, ఎల్లేశ్, లక్ష్మణ్ బి.భిక్షపతి, రాజమణి పాల్గొన్నారు.

రేపటినుంచి శిక్షణ తరగతులు

కాజీపేట: కాజీపేట ప్రధాన రహదారిపై కుల వివక్ష పోరాట సమితి సభ్యులు కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 15నుంచి 17వ తేదీ వరకు విద్యుత్ భవనంలో జరగనున్న రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య, మొగిళి, సుగుణ, జ్యోతి, రాజు, శీను తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల చేతివాటంతో నష్టం



వేలేరు : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో గతంలో పనిచేసిన ఓ డిప్యూటీ తహసీల్దార్, వీఆర్ఓ చేతివాటంతో తీవ్రంగా నష్టపోయానని మండలంలోని శాలపల్లి గ్రామానికి చెందిన రైతు కూరపాటి రమేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామానికి చెందిన కొంతమంది పెద్దమనుషులు, మాజీ మావోయిస్టులు కలిసి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తన పట్టా భూమిని ఆక్రమించుకుని, అసైన్డ్ భూమిని, కుంటలను తనకు కట్టబెట్టారని ఆరోపించారు. భూముల ధరలు పెరగడంతో గతంలో ఇక్కడ పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ మధ్యవర్తిగా ఈ ముఠాతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారాడని ఆరోపించాడు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు స్పందించి భూ ముఠా సభ్యులు ఆక్రమించుకున్న తన భూమిని ఇప్పించాలని బాధితుడు కోరాడు.

పీహెచ్‌సీలోకి జీపీ కార్యాలయం తరలింపు



జీపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీఓ

దామెర : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం స్థానిక పీహెచ్‌సీ భవనంలోకి తరలించినట్లు ఎంపీఓ రంగాచారి తెలిపారు. గ్రామంలోని గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో ఒక భవనం అద్దెకు తీసుకుని కొద్ది సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. కాగా పీహెచ్‌సీ భవనంలోని ఒక గదిలోకి జీపీ కార్యాలయాన్ని తరలించారు. ఈ భవనంలో 8 సంవత్సరాల పాటు తహసీల్దార్ కార్యాలయం కొనసాగగా ఇటీవల నూతన భవనంలోకి మార్చారు. దీంతో ఖాళీగా ఉన్న ఈ భవనంలోకి జీపీ కార్యాలయాన్ని మార్చినట్లు ఎంపీఓ తెలిపారు. ఎంపీఓ రంగాచారితో పాటు పంచాయతీ కార్యదర్శి నరేష్, మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి భిక్షపతి, కారోబార్ బొబ్బిలి, ఎఫ్ఏ సారంగం, నాయకులు కొమ్మాలు, రాజకొమురు, రతన్, రవి తదితరులు పరిశీలించారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న తనిఖీ బృందం

దామెర : మండలంలోని పలు గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనులపై తనిఖీలు కొనసాగుతున్నట్లు ఏపీఓ శారద తెలిపారు. తనిఖీల్లో భాగంగా శనివారం మండలంలోని సింగరాజుపల్లి, దుర్గంపేట, వెంకటాపురం, సీతారాంపురం, దమ్మన్నపేట గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన పనులపై గ్రామ సభల్లో చర్చించినట్లు ఆమె వెల్లడించారు. ఈనెల 16వ తేదీన మండల ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజిక తనిఖీకి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో డీటీ ఖురేషి, ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, కార్యదర్శులు సందీప్, పద్మ, సిరివెన్నెల, రజిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి వహించాలి



బాలుడి బరువు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ రాణి

దామెర : పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి అన్నారు. గ్రోత్ మేళా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో 0–5 సంవత్సరాల పిల్లల ఎత్తు, బరువును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాణి మట్లాడుతూ.. పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతగానే ఉపయోగపడుతుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం వంటి పోషకాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సదిరం కోమల, బిల్లా వనజ, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యఉద్యమాలతోనే రిజర్వేషన్ సాధన



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

సంగెం : ఐక్యఉద్యమాల ద్వారానే రిజర్వేషన్‌ను సాధించుకోగలమని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ స్పష్టం చేశారు. మండలంలోని నల్లబెల్లిలో మత్స్య శాఖ గ్రామ కమిటీ చైర్మన్ నీరటి రాజు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి దేవేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం ముదిరాజ్ సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులు సత్తా చాటాలని కోరారు. అనంతరం డిమాండ్లపై నినాదాలు చేశారు. నాయకులు నీరటి సూరయ్య, సారంగం, సమ్మయ్య, సంపత్, ఐలయ్య, రాజు, సుధాకర్, ఎల్లయ్య, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లో చేర్చాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ చౌరస్తా: సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన ముదిరాజ్ కులస్తులను బీసీ 'డీ' జాబితా నుంచి బీసీ 'ఏ'లో చేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ డిమాండ్ చేశారు. ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేయనున్నట్లు తెలిపారు. మచిలీబజార్‌లోని ముదిరాజ్ మహాసభ కమ్యూనిటీ హాల్‌లో వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ముదిరాజ్ మహాసభ అర్బన్ ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్, చొప్పరి సోమయ్య, రాజ్‌కుమార్, సత్యనారాయణ, సారంగపాణి, సాంబమూర్తి, విక్రమ్, బుచ్చిరాజు, సదానందం, హరికృష్ణ, ప్రకాష్, సమ్మయ్య, సాంబయ్య, వెంకటస్వామి, రవీందర్, మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి



పట్టా అందిస్తున్న రాంకిషన్, జయపాల్ రెడ్డి

హన్మకొండ: ఫార్మసీ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఎ.రాంకిషన్ సూచించారు. హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో 26వ స్నాతకోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసిస్టులుగా సమాజానికి అత్యుత్తమ సేవలు అందించాలన్నారు. సెయింట్ పీటర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల చైర్మన్ టి.జయపాల్ రెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ విద్యలో తమ కళాశాల విద్యార్థులు పరిశోధనల్లో అగ్రగామిగా నిలిచారని గుర్తుచేశారు. ప్రిన్సిపాల్ రాజశ్రీ దుర్కే అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో ఫార్మసీ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎ.రాంకిషన్, కళాశాల చైర్మన్ టి.జయపాల్ రెడ్డి పట్టాలు ప్రదానం చేశారు.

పార్టీని పటిష్టం చేయాలి



హసన్‌పర్తి: పార్టీని పటిష్టం చేయాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే నాగరాజు పిలుపునిచ్చారు. నగరంలోని రెండవ డివిజన్ బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు గడిపి జీవన్, ఎస్‌కే.ఆసిఫ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి శనివారం ఆహ్వానించారు. పార్టీలో చేరిన అందరికి సమ ప్రాధాన్యం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ హనుమకొండ మండల అధ్యక్షుడు మాదాసి అజయ్, గ్రామశాఖ అధ్యక్షుడు రాజయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ తిరుపతి, యూత్ అధ్యక్షుడు దయాకర్ పాల్గొన్నారు.